**ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం**

**విశాఖపట్నం కేంద్రం**

**జాతీయ వార్తలు**

తేదీ: 03-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

**ముఖ్యాంశాలు**

- 'ఆత్మనిర్భరత' ద్వారా 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.
- సీమాంతర ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ ఆపాల్సిందేనని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు.
- దేశ రక్షణ రంగ ఎగుమతులు 2029 నాటికి 50 వేల కోట్ల రూపాయలకు చేరుకుంటాయని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.
- పాక్ ఆక్రమిత జమ్మూ కశ్మీర్ ప్రాంతంలో పాకిస్థాన్ చేస్తున్న మానవ హక్కుల ఉల్లంఘనలకు ఆ దేశం బాధ్యత వహించాల్సిందేనని భారత్ డిమాండ్ చేసింది.
- భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య అహ్మదాబాద్ లోని జరుగుతున్న తొలి టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో భారత్ 5 వికెట్లు నష్టపోయి 448 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

'వికసిత భారత్' లక్ష్య సాధనకు 8 శాతం జీడీపీ వృద్ధి రేటు అవసరమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన 'కౌటిల్య ఆర్థిక సదస్సు' ప్రారంభ సమావేశంలో ఆమె ప్రసంగించారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా, నిలకడగా వృద్ధి చెందుతోందని, ప్రపంచంలో ఏర్పడే ఆర్థిక అనిశ్చితిని తట్టుకునే సామర్థ్యం భారత్‌కు ఉందని నిర్మలా సీతారామన్ ఉద్ఘాటించారు. తమ ప్రభుత్వం 'ఆత్మనిర్భరత' ద్వారా 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగుతోందని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ బైట్...25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ రక్షణ రంగ ఎగుమతులు 2029 నాటికి 50 వేల కోట్ల రూపాయలకు చేరుకుంటాయని కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రి జి. కిషన్ రెడ్డి సమక్షంలో మూడు రోజుల పాటు జరిగే జిటో కనెక్ట్ ఎగ్జిబిషన్ ను రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్షణ రంగంతో సహా అన్ని రంగాలు ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా పయనిస్తున్నాయని తెలిపారు. భారత్ ప్రపంచానికి 'తయారీ కేంద్రంగా' మారే రోజు ఎంతో దూరంలో లేదని ఆయన అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ద్వారా రక్షణ వ్యవస్థలలో స్వదేశీ పరికరాలను ఉపయోగించడం సాధ్యమైందని, తేజస్ లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లోని భాగాలలో 64 శాతం భారతదేశంలోనే తయారయ్యాయని ఆయన వెల్లడించారు. 2030 నాటికి భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముంబై-అహ్మదాబాద్ హై-స్పీడ్ రైలు కారిడార్ పనుల్లో భాగమైన సూరత్ హై-స్పీడ్ రైలు నిర్మాణ స్థలాన్ని రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్, జపాన్ రవాణా, పర్యాటక శాఖా మంత్రి హిరోమసా నకానోతో కలిసి ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ముంబై-అహ్మదాబాద్ హై-స్పీడ్ రైలు ప్రాజెక్టులోని కీలక అంశాలను ఇరు దేశాల మంత్రులు సమీక్షించారు. అధునాతన ట్రాక్ స్లాబ్ లేయింగ్ కార్, ట్రాక్ స్లాబ్ అడ్జస్ట్‌మెంట్ సదుపాయం వంటి హై-స్పీడ్ మౌలిక సదుపాయాలలో ముఖ్యమైన భాగాలను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై ఇరువురు మంత్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగంగా జరుగుతున్న తీరును కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' నేటికి 11 ఏళ్లు పూర్తి చేసుకుంది. 2014లో ఇదే రోజున విజయదశమి సందర్భంగా ఆకాశవాణిలో 'మన్ కీ బాత్' తొలి ఎపిసోడ్ ప్రసారమైంది. ఇప్పటివరకు ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి 126 ఎపిసోడ్‌లలో ప్రసంగించారు. ఈ 11 ఏళ్ల ప్రయాణంలో ప్రధాని మోదీ ముఖ్యమైన సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ, ప్రవర్తనాపరమైన అంశాలను ప్రస్తావించారు. పౌరులతో ప్రధానమంత్రి నేరుగా సంభాషించేందుకు 'మన్ కీ బాత్' ఒక ముఖ్యమైన వేదికగా మారింది. సామాజిక మార్పునకు స్ఫూర్తినిచ్చి, జాతీయ ఐక్యతను పెంపొందిస్తోంది. విధానాలను ప్రజల ఉద్యమాలుగా మార్చడమే కాకుండా, ఒక నాయకుడి గళం దేశంలోని ప్రతి భాగానికి ఎలా చేరుతుందో 'మన్ కీ బాత్' నిరూపించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పాక్ ఆక్రమిత జమ్మూ కశ్మీర్ ప్రాంతంలో పాకిస్థాన్ చేస్తున్న మానవ హక్కుల ఉల్లంఘనలకు ఆ దేశం బాధ్యత వహించాల్సిందేనని భారత్ గట్టిగా డిమాండ్ చేసింది. ఈరోజు న్యూఢిల్లీలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. పీఓకేలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న నిరసనలు, పౌరులపై పాక్ దళాలు ప్రదర్శిస్తున్న క్రూరత్వంపై వచ్చిన నివేదికలను ఆయన ప్రస్తావించారు. ఈ ప్రాంతాలు పాకిస్థాన్ అక్రమ, బలవంతపు ఆక్రమణలో ఉన్నాయని తెలిపారు. పాకిస్థాన్ అవలంబిస్తున్న అణచివేత ధోరణి, సహజ వనరుల వ్యవస్థీకృత దోపిడీ ఈ నిరసనలకు కారణమని న్యూఢిల్లీ విశ్వసిస్తోందని రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సీమాంతర ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ ఆపాల్సిందేనని భారత సైన్యాధిపతి (ఆర్మీ చీఫ్) జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ సమీపంలోని 22 ఎండీలోని ఆర్మీ పోస్ట్‌లో సైనికులను ఉద్దేశించి ఆయన ఈరోజు మాట్లాడారు. పాకిస్థాన్‌లో ఉగ్రవాద గ్రూపులు వున్న 9 ప్రాంతాలను నాశనం చేయడమే 'ఆపరేషన్ సిందూర్' సాధించిన ప్రధాన విజయమని జనరల్ ద్వివేది తెలిపారు. ఈ ఆపరేషన్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా 'సిందూర్' అని పేరు పెట్టారని, ఇది దాని ప్రాముఖ్యతను స్పష్టం చేస్తోందని ఆర్మీ చీఫ్ పేర్కొంటూ...

(వాయిస్ బైట్...27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు 62 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు కార్యక్రమాలను న్యూఢిల్లీ నుంచి ప్రారంభించనున్నారు. దేశంలోని వెయ్యి ప్రభుత్వ ఐటీఐలను (ITIs) ఆధునీకరించే లక్ష్యంతో రూపొందించిన 'పీఎం-సేతు' (PM-SETU) పథకాన్ని ప్రధాని మోదీ లాంఛనంగా ప్రారంభిస్తారు. దేశంలోని 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని నవోదయ విద్యాలయాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ఏర్పాటు చేసిన 1,200 వృత్తి నైపుణ్య ల్యాబ్‌లను ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. బీహార్ రాష్ట్రంలో పునర్నిర్మించిన 'ముఖ్యమంత్రి నిశ్చయ్ స్వయం సహాయతా భత్తా యోజన'ను కూడా ప్రధాని ప్రారంభిస్తారు. ఈ పథకం కింద ఐదు లక్షల మంది గ్రాడ్యుయేట్లకు రెండు సంవత్సరాల పాటు నెలకు వెయ్యి రూపాయల భత్యం అందించబడుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్ నాలుగు నుంచి ఐదు పాకిస్థాన్ యుద్ధ విమానాలను ధ్వంసం చేసిందని భారత వైమానిక దళాధిపతి (చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్), ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అన్నారు. 93వ వైమానిక దళ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన వార్షిక విలేకరుల సమావేశంలో

ఆయన మాట్లాడారు. మొత్తం తొమ్మిది ప్రధాన లక్ష్యాలలో, రెండు కీలక లక్ష్యాలను ఛేదించడంలో భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ప్రధాన పాత్ర పోషించిందని చెప్పారు. ఈ ఆపరేషన్ ప్రణాళిక దశ నుంచే మూడు దళాలు (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) కలిసి పనిచేశాయని పేర్కొన్నారు. యుద్ధ స్వభావం నిరంతరం మారుతోందని ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. తదుపరి యుద్ధం, గత యుద్ధంలా ఉండబోదని, భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలకు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ ,వెస్టిండీస్ జట్ల మధ్య అహ్మదాబాద్ లోని నరేంద్రమోదీ స్టేడియం వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లో భారత్ రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్లు నష్టపోయి 448 పరుగులు చేసింది. భారత్ బాట్స్ మెన్ లలో కె ఎల్ రాహుల్ , ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా శతకాలతో రాణించారు. అంతకముందు వెస్టిండీస్ 162 పరుగులకు ఆలౌట్ అవడంతో తొలి ఇన్నింగ్స్ లో భారత్ కు 286 పరుగుల ఆధిక్యం లభించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. ఈ రాష్ట్రాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని ఐఎండీ పేర్కొంది. మధ్యప్రదేశ్, తూర్పు ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ తోపాటు ఈశాన్య భారత్ లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాలతో పాటు కోస్తా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తూర్పు ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో 24 గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =